



## ఆదివారం కథ

మాధవరావు, కనకారావుల ఇంట్లోంచి భక్తి పాటలు పొరుగింటటికే జోరుగా వినిస్తున్నాయి. కారణం వాళ్ళ కన్నతల్లి పూర్ణమ్మ చనిపోయి ఆ రోజుకు పదకొండవ రోజు. ఆమె పేర దానాలు, ధర్మాలు అన్నీ జోరుగానే సాగుతున్నాయి. ఆ రోజే ఆఖరి రోజవటం చేత గోత్రీకుల్నీ, బంధువుల్నీ, యిరుగు పొరుగువారినీ, ఇంకా తెలిసిన వాళ్ళందర్నీ భోజనాలకు పిలిచారా అన్నదమ్ములు.

భోజనాల్లోకి కూరలు, పచ్చళ్ళు యెక్కువే వడ్డించారు. పరవాణ్ణంలో చిక్కటి పాలుపోయించి, ఎత్తుకెత్తు జీడిపప్పులు, యాలుకలు, కిస్‌మిస్‌లు దండిగా పోయించి చేయించారు. తింటున్న వాళ్ళంతా 'ఆహా... పరవాణ్ణం చాలా బావుంది. అన్నాల్లోకి వడ్డించిన వన్నీ మహారుచిగా వున్నాయి. కొడుకులంటే యిలా వుండాలి. పూర్ణమ్మ యెంత అదృష్టవంతురాలు, అందరికీ కొడుకులుంటారు. కానీ తల్లి చావుకింత ఖర్చు పెట్టేవారుంటారా" అని పొగుడుతూ మళ్ళీ మళ్ళీ మారు పెట్టించుకుని లొట్టలు వేసుకుంటూ తింటున్నారు.

వడ్డన సరిగా జరుగుతూందో లేదోనని అక్కడే దగ్గరుండి వడ్డన జరిపిస్తున్న అన్నదమ్ముల ముఖాలు చేటంతయ్యాయి. అందరూ వీళ్ళను పొగుడుతుంటే పొంగిపోయి అడిగిన వారికీ, అక్కర్లేని వారికీకూడా మరీ మరీ అడిగి వడ్డన చేయిస్తున్నారు.

"ఒరేయ్ నారిగా... అమ్మకు నారాయణుడంటే భక్తి యెక్కువరా అన్నీ ఆ పాటలే పెట్టు" అంటూ రికార్డులు వేస్తున్న కుర్రవాడిని కాబోలు వొక్క కేక పెట్టాడు కనకారావు. వెంటనే హరే నారాయణా, త్రిభువన పాలన కళాపారీణా' అనే పాట వేశాడు అతను.

ఆ వరుసలోనే కూర్చుని భోంచేస్తున్న అనసూయమ్మకు మాత్రం ఆ పరవాణ్ణం, వంటలు చేదుగా అనిపించాయి. వాటిల్లోనుంచి పూర్ణమ్మ ఆకలి అరుపులు వినిపించాయి. పూర్ణమ్మ యింటికి నాలుగిళ్ళవతలే అనసూయమ్మ ఇల్లు.

అక్కడ తింటున్న వాళ్ళందరిలోనూ పూర్ణమ్మ చివరి రోజుల్లో ఎలా బ్రతికిందో, ఎంత హీనంగా కొడుకుల చేత, కోడళ్ళచేత చూడబడిందో తెలిసిన వాళ్ళుండవచ్చు, తెలియని వాళ్ళుండవచ్చు కానీ పోయిన ముసలామె పడిన బాధలెవరిక్కావాలి.. బ్రతికున్న వాళ్ళను పొగిడితే యెప్పుడయినా అవసరపడినపుడుపయోగించుకోవచ్చనుకుంటారు.

లోకం తీరే అంత– పూర్ణమ్మ పోయిన రోజు నిజంగా వచ్చిన యేడుపో, లేక లోకులకోసం తెచ్చుకున్న యేడుపో మరి యెవరికీ తెలియదుకానీ మాధవయ్య, కనకారావులు మాత్రం నోట్లో తుండు కుక్కుకుని మరీ యేడ్చారు.

"ఊరుకోండర్రా పోయిన వాళ్ళతో మనమూ పోగలమా, పెద్దవాళ్ళు పోతే పెళ్ళితో సమానమన్నారు. ఎనభై యేళ్ళ ముసలామె పోతే మీరిలా దుఃఖించకూడదు" వచ్చిన పెద్దలు వూరడింపు మాటలు వల్లెవేశారు. అందుకే పాపం పెద్దలమాట ననుసరించి అన్నదమ్ములిద్దరూ తల్లి చావుకు బాగా ఖర్చు పెడ్తున్నారు.

పూర్ణమ్మ మొదట్నించీ చాలా సామాన్యపు బ్రతుకు బ్రతికింది. భర్త వుండగా అతనెక్కడో గుమాస్తాగా పనిచేసేవాడు. అతనికొచ్చే జీతం చాలా తక్కువవ్వటం చేత ఆ వచ్చిన దాంతోనే పొదుపు చేస్తూ భర్తకు, పిల్లలకు కడుపు నిండా పెట్టి మిగిలిందితిని సరిపెట్టుకునేది. అలా సంవత్సరాలు గడిచిపోయాయి. కొడుకులు పెద్దవాళ్ళయ్యారు. అప్పు చేసి కొడుకుల పెళ్ళిళ్ళు పూర్తి చేశాడు దామోదరం (పూర్ణమ్మ భర్త) పెళ్ళిళ్ళకు చేసిన అప్పు పూర్తిగా తీరకముందే చనిపోయాడాయన.

కాలక్రమేణా మాధవయ్య, కనకారావులు స్వంత వ్యాపారం చేసి బాగానే సంపాదించారు. కొడుకు లెంత అభివృద్ధిలోకి వచ్చినా వాళ్ళ భార్యలకు నగలు, చీరలు యేర్పడ్డాయే తప్ప తల్లి పూర్ణమ్మ బ్రతుకులో యేమార్పు లేదు. అంత పెద్దవయసొచ్చాక కూడా యింటెడుపనీ తనే చేసేది. అయినా ఆమె తిన్నదోలేదో యెవరూ పట్టించుకోరు. ఆదరపూర్వకంగా యెవ్వరూ ఆమెతో మాట్లాడి యెరుగరు. పూర్ణమ్మ దీనికి మనసులో నొచ్చుకునేది కాదు. కొడుకు లెదిగి వృద్ధిలోకి వచ్చినందుకు సంబరపడి పోయేది.

మరికొన్నాళ్ళు గడిచేసరికి పూర్ణమ్మ వొంట్లో శక్తి తగ్గిపోయింది. ముందులా పని చేయలేక పోయేది. నీరసం, నిస్సత్తువ ఆవరించాయామెను. పండో, మిఠాయో తినాలనున్నా యెవర్నీ డబ్బులడగలేక పోయేది. పెద్దదయిపోయిన తల్లికి యెంతో కొంత డబ్బు తల్లికివ్వాలని గ్రహించే వారు కాదు కొడుకులు. కొడుకులకే పట్టనిది కోడళ్ళకు పడ్తుందా? అత్తగారికి పని చేసే వోపిక తగ్గిన తరువాత తిండి పెట్టటమే దండుగని పించింది కోడళ్ళకు. కొంత మందికి వయసు పెరిగే కొద్దీ నిద్రపెరుగుతుంది. మరి కొంత మందికీ ఆకలి, జిహ్వాచాపల్యం పెరుగుతుంది. పూర్ణమ్మ రెండో రకానికి చెందింది. ఆవిడ పరిస్థితి ముక్కుతూ, మూలుగుతూ వుండే స్థితి కొచ్చింది.

ఇంక ఆవిడవల్ల లాభం లేదనుకున్నారేమో దొడ్లో వున్న సామాను గది సర్దించి అందులో వుండమన్నారు కోడళ్ళు. ఆమె తిండికి వంతులు వారీగా చెరో గిద్దెడు బియ్యం యిచ్చేవాళ్ళు. వొండుకోటానికో పాత స్టౌ యిచ్చారు. వాళ్ళు తినగా మిగిలిన కూరేమయినా వుంటే అత్తకిచ్చేవాళ్ళు లేకుంటే, వాళ్ళకు సహించని కూరలు పచ్చివే ఆమె గదిలో పడేసేవారు.

ముసలి తనంలో వాళ్ళ సేవలో తన బ్రతుకు ముగిసిపోవాలనాశించిన పూర్ణమ్మకు ఆకలి తీర్చుకోవటానికి తనే శ్రమపడాల్సి వచ్చినందుకు లోలోపలే కన్నీరు మున్నీరుగా యేడ్చేది. వండుకోగలిగినప్పుడు తినేది. లేనప్పుడు పస్తులుండేది. ఇదేవరికీ పట్టేదికాదు. ఆమెకు శ్రీమన్నారాయణడంటే భక్తి యెక్కువయినా చదువురాదు. విష్ణునామాలు చదువకుండా పూజచెయ్యటం యిష్టంలేక వీలున్నప్పడల్లా "నారాయణా, కేశవా, మాధవా" అని నోటితో జపించి తృప్తి పడేది.

పూర్ణమ్మ చూసి జాలిపడే అనసూయమ్మంటే పూర్ణమ్మకు ఆత్మీయురాల్లా కనిపించేది. చివరి దశలో తన కష్టాలు అనసూయమ్మతో చెప్పుకొని వూరట పొందేది. ఎంత జాలి కల్గినా ఇతరులెందాకా చూడగలరు? కన్న బిడ్డలకు తెలియాలి కానీ...

అనసూయమ్మ కూడా యేమంత స్థితిపరురాలు కాకపోయినా పూర్ణమ్మను చూసి జాలివేసి తనకున్నదాంట్లో తృణమో, ఫణమో పెట్టేది. ఆకలితో అలమటించే వారికి పరమాన్నాలు పెట్టకపోయినా, కలిగిన దాంట్లోనే యిచ్చి రవ్వంత సానుభూతి చూపటం కనీస మానవత్వమనిపించుకుంటుంది. అనసూయమ్మలో ఆ గుణమే పరిపూర్ణంగా వున్నది. పూర్ణమ్మ గుర్తుకు వచ్చి ఆమె కళ్ళు తడి అయ్యాయి.

హూ.. ఏం మనుషులు? కన్నతల్లి బ్రతికుండగా ఆమెకు విశ్రాంతినిచ్చి, ఆమె బ్రతికుండగా ఆమె తినటానికిక్కూడా ఆమె వండుకుంటుంటే పట్టనివాళ్ళు ఆమె పోయిన తరువాత ఆమె పేరుతో వూరివారందరికీ మెక్కబెడుతూ మెహర్బానీ పొందుతున్నారు.

భార్యలతో వండించి పెట్టకపోయినా తోచిన డబ్బు తల్లి చేతికిచ్చి తల్లికి కావల్సింది కొనుక్కు తినమని యేనాడు చెప్పని ఈ పుత్రరత్నాలు ఈ వేళ తల్లి పేరుతో పేరుకోసం వేలు ఖర్చు పెడుతున్నారు. తల్లి కడుపు మాడ్చుకొని తమను పెంచిన సంగతే మర్చిపోయారు. డబ్బు పెరిగినా అన్ని విధాలా శక్తివున్నా కన్నతల్లికి గుప్పెడు మెతుకులు కంచంలో పెట్టించలేని, ప్రాణం వుండగా కడుపు నింపలేని వీళ్ళా కొడుకులు–?

ఎంత స్వార్థపరులు? వీళ్ళ పాపపు చర్యలకు అల్పులయిన మనుషుల సంగతేమో కానీ, భగవంతుడు సంతసించేనా..?

ఇదంతా యెవరి కోసం?

ఆమె ఆత్మంటూ వుంటే తృప్తి చెందేనా..?

అనసూయమ్మకింక తినాలనిపించలేదు. పూర్తిగా భోం చెయ్యకుండానే మధ్యలో లేచి చెయ్యి కడిగేసుకుంది.

"అదేం మధ్యలో వెళ్ళిపోతున్నారు?" అడిగారెవరో

"తినాలనిపించలేదు. వొంట్లో బాగా లేదు" పొడిగా చెప్పి అక్కడో క్షణం కూడా వుండబుద్ధికాక వెళ్ళిపోయింది అనసూయమ్మ.